
# కేటలినా అయిలాండ్ ట్రావెలాగ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి



*(గత సంచిక తరువాయి)*



**కేటలినాలో** 160 మైళ్ళ పేవ్డ్, అన్ పేవ్డ్ (మట్టి) రోడ్లున్నాయి. జీప్‌లో ఐలండ్ లోపలకి వెళ్ళి చూడచ్చు. ఊరంతా తిరిగే ది గేరిబాల్డీ అనే స్థానిక ఎలక్ట్రిక్ పబ్లిక్ సర్వీస్ బస్ ఉంది. టిక్కెట్ 2 డాలర్లు. అంగవికలురకి, 65 పై బడ్డవాళ్ళకి ఉచితం. పర్యావరణం కోసం ఎలక్ట్రిక్ బస్‌లని నడుపుతున్నారు. చిన్న ఊరు కాబట్టి చుట్టుపక్కలంతా కాలినడకనే తిరిగిచూద్దామనుకున్నాం. మేమున్నది షాపింగ్ సెంటర్ కాబట్టి ముందుగా చుట్టుపక్కల మెయిన్ రోడ్లోని షాప్స్ అన్నీ తిరిగి చూసాం. ఎక్కువగా సూవెనీర్ షాప్సే. స్థానిక కళాకారులు చేసిన బొమ్మలు ఆ షాపుల్లో కనిపించాయి. మర్నాడే హాలోవీన్ పండగ. ఆ సందర్భంగా వాటిలో దెయ్యాలు, పుర్రెలు, అస్థిపంజరాలు మొదలైనవి అమ్ముతున్నారు. ఇంకా టోపీలు, చెప్పులు, బూట్లు, ఫ్రిజ్ మేగ్నెట్స్, గాజుసామాను, కీ చెయిన్స్, అలంకరణగా ఉపయోగించే చేపల బొమ్మలులాంటివి కూడా. అన్నీ ఖరీదుగా ఉన్నాయి.

సాయంత్రం 6దాకానే షాప్స్ తెరచి ఉంటాయి. షాప్స్ మధ్య హోటల్స్ కూడా ఉన్నాయి. ఈ దీవిలో మొత్తం 30 రెస్టొరెంట్స్, ఇంకా కాఫీ అండ్ స్వీట్ షాప్స్ కూడా చాలా ఉన్నాయి. రెస్టొరెంట్స్ బయట గోడకి మెనూ బోర్డ్స్ ఉన్నాయి. వాటిని చదివి రాత్రి డిన్నర్‌కి దేనికి వెళ్ళాలో రెండు ఎంపిక చేసాం. ఒకటి మెక్సికన్ టేకో. రెండోది ఎవలాన్ గ్రిల్. కానీ ఎవలాన్ గ్రిల్‌కే వెళ్ళాం.

చాలామంది పర్యాటకులు అద్దెకి తీసుకున్న సైకిళ్ళు, సెగ్వేస్, గోల్ఫ్ కార్ట్‌ల మీద కనిపించారు. సమీపంలోని వీధులన్నీ నడిచి చూసాం. వీధుల్లో బేటరీతో నడిచే వాహనాలు దాదాపు ప్రతీ ఇంటిముందు పార్క్ చేసి కనిపించాయి. ఇంటికో గోల్ఫ్ కార్ట్ మాత్రమే అనుమతిస్తారు. ఆ చిన్న, శుభ్రమైన రోడ్లని, ఇళ్ళ ఎక్స్‌టీరియర్లని చూస్తే నేను గతంలో చూసిన యూరప్‌లో ఉన్నానా అని నాకు అనిపించింది. ఓ ఇంటి చెక్క ప్రహరీ గోడకి అలంకరణగా తోటపనికి చెందిన పాత ఇనప పనిముట్లని బిగించారు. మరో వైపు గోడకి స్క్రూ డ్రైవర్‌లాంటి పనిముట్లు, పాత్రలు అలంకరణగా బిగించారు. చాలా ఇళ్ళ బయట అమెరికన్ జెండాలు, కొన్ని ఇళ్ళ బయట కేలిఫోర్నియా రాష్ట్ర జెండాలు కూడా వేలాడుతున్నాయి.



ఇళ్ళమధ్య ఓ సూపర్ బజార్ కనిపిస్తే లోపలకి వెళ్ళాం. వెజ్ సలాడ్ పౌండ్ 4.99 డాలర్లు. ఎప్పటిదాకా తీసుంటుందని అడిగితే, రాత్రి పదకొండుదాకా అని చెప్పారు. అక్కడనించి గూగుల్ మేప్‌లో బస్ బే ఎడ్రస్ చూసుకుంటూ నడిచి వెళ్ళాం. ఆ విశాలమైన ప్రదేశంలో చుట్టూ చెట్లు. లిపి వెళ్ళి సీనిక్ టూర్ బస్‌కి మాకు టిక్కెట్లని కొని తెచ్చింది. ముగ్గురికీ 57డాలర్లు. బస్ వచ్చేదాకా అక్కడున్న బెంచీ మీద కూర్చున్నాం. బస్‌లోకి ఎక్కాక గైడ్ మైక్‌లో చెప్పిన తన పేరు ఫస్ట్ గేర్ శబ్దం మింగేసింది.

సిటీ హాల్, షికాగో కబ్స్, డేన్స్ కనెక్షన్, ఫైర్ స్టేషన్, గోల్ఫ్ కోర్స్, లవర్స్ కోవ్ మొదలైనవి గైడ్ మాకు పరిచయం చేసింది.

"1930లు, 40లలో ఇక్కడి కేసినోలో జరిగే కాన్సర్ట్స్‌ని రేడియోలో ప్రసారం చేసేవారు. ఇక్కడి అతి పొడవైన బీచ్ పేరు శాన్ పెడ్రో. ప్రతీదీ నడక దూరంలోనే ఉంటుంది. ఇక్కడ కారు కొనాలంటే వేచి ఉండాలి. కోటా ప్రకారమే కార్లు ఊళ్ళోకి వస్తాయి. అందుకని ప్రయాణానికి నడక, సైకిళ్ళు లేదా గోల్ఫ్ కార్ట్‌ని ఉపయోగిస్తాం." ఆమె చెప్పింది.



"ఇంతకు మించి ఈ చిన్న ద్వీపంలో చూడటానికి ఏముంటాయి?" ఒకరు అన్నమాటలు వినిపించాయి.

బస్ కొండమీదకి పూర్తిగా ఎక్కాక ఓ ఇంటిముందు భాగం కనిపించింది.

"ఇది లాంగ్ పాయింట్. 1921లో ఎల్ షేప్‌లో కట్టిన రిగ్లీ మేన్షన్. సముద్రం వైపు నించి కొండమీదకి మెట్లున్నాయి. కొండవైపు రోడ్ ఉంది. రిగ్లీ భార్య అదా సలహాల మీద దీన్ని కట్టారు. ఈ కొండకి కూడా అదా పేరునే పెట్టారు. 'మౌంట్ అదా'. ఈ మూడంతస్థుల పెంకులు కప్పిన బిల్డింగ్‌లో బిలియర్డ్స్ రూం, టర్కిష్ బాత్, ఆర్గన్ ఛాంబర్, రెఫ్రిజరేటర్ రూం, సన్ రూం, టెర్రెస్ పోర్చ్, ఆరు పడకగదులు ఉన్నాయి. మా ఐలండ్‌లోని అతి పెద్దిల్లు ఇదే. గ్రేట్ డిప్రెషన్ సమయంలో రిగ్లీ ఈ ఇంటిని ఫేక్టరీగా మార్చి వర్కర్స్‌కి టైల్స్‌ని తయారు చేయడం, వాటికి చేత్తో రంగులు వేయడం లాంటి పనులనిచ్చాడు. టైల్స్ అన్నిటికీ ఒకే రంగుని యూనిఫాంగా వేసేవారు కాదు. 1985లో దీన్ని లగ్జరీ బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌గా మార్చారు. ఇందులో కేవలం ఆరు సూట్స్ మాత్రమే ఉన్నాయి. బస చేసినవారు ఉపయోగించడానికి ఉచితంగా గోల్ఫ్ కార్ట్ ఇస్తారు. ఇందులో లంచ్ తింటే ఇల్లంతా చూపిస్తారు" గైడ్ చెప్పింది.

ఓ చోట గైడ్ రంగేసిన రెండు దున్నపోతు విగ్రహాలని చూపించింది తప్ప ఈ టూర్‌లో మాకు ఒక్క బైసన్ కూడా కనపడలేదు. తిరుపతి ఘాట్ రోడ్‌లా ఉన్న రోడ్ మీద మా బస్ కొండమీద పైకెళ్ళి కిందకి వచ్చింది. మొత్తం 20 మైళ్ళ రౌండ్ ట్రిప్. ప్రయాణకాలం గంట. బస్ వెనక్కి తిరిగేటప్పుడు కొండమీంచి కుడివైపు కనిపించిన ఎవెలాన్ వ్యూ చాలా బావుంది. దీని సముద్ర తీరం 54 మైళ్ళు.

"కారు కోసం క్యూలో 35 నించి 40 ఏళ్ళు వేచి ఉండాలి. కొరోజన్ నించి రక్షించడానికి చాలా యూకలిప్టస్ చెట్లని పెంచుతున్నాం. వాతావరణం మీద మాకు చాలా శ్రద్ధ ఉంది. ఈ దీవిలో డీజిల్‌ని ఉపయోగించరు. పెట్రోల్ ధర గ్రేడ్లని బట్టి గేలన్ 6డాలర్ల

58 సెంట్లు, 6.70, 7.10. ఇక్కడ ఖరీదైన మూడో వస్తువు తాగునీరు. హోటల్లో షాప్‌లలో అమ్మే నీళ్ళ సీసాలు ద్వీపం బయటనించి వస్తాయి. టాయ్‌లెట్లో సముద్రపు నీరే వాడతారు. అది చవక కాబట్టి ఆ నీటిని శుద్ధి చేసి మళ్ళీ మళ్ళీ వాడతారు."

ఓ ఇంటిమీద సోలార్ పేనల్ కనిపించింది. 1921లో కట్టిన ఒరిజినల్ కేసినో బిల్డింగ్ కింద సముద్రపు ఒడ్డున కనిపించింది. తిరుగు ప్రయాణంలో గైడ్ తన స్కూల్ భవంతిని చూపించింది.

"ఎవలాన్ స్కూల్లో పదమూడు తరగతులున్నాయి. 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడే ఎవలాన్ నగరంలోని 80శాతం ఉంది."

బర్డ్స్ పార్క్‌ని చూపించి చెప్పింది.

"రిగ్లీ పక్షులని సేకరించేవాడు. వాటిని లాస్ ఏంజెలెస్ జూకి విరాళంగా ఇచ్చి పోషించేవాడు. 1892లో ఈ ద్వీపాన్ని అతను వేలంలో కొన్నాడు. 1950లో జరిగిన అగ్నిప్రమాదం వల్ల ఈ ఐలండ్ దివాలా తీసింది. 1919లో విలియం రిగ్లీ ఇక్కడ 20 లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టాడు. ఈ ద్వీపం కంపెనీకి చెందిన 99శాతం కేటలీనా షేర్స్‌కి ఆయన యజమాని."

గంట తర్వాత బస్ బయల్దేరిన చోటికే వచ్చి ఆగింది.

రూంకి వచ్చి ఫ్రెష్ అయి డిన్నర్‌కి ఎవలాన్ గ్రిల్స్ హోటల్‌కి వెళ్ళాం. ముందు బాటిల్డ్ వాటర్, రోస్టెడ్ టమోటా సూప్, బేసిల్ వేసి ఫ్రై చేసిన బంగాళాదుంపల కూర, గ్రిల్డ్ కేలిఫోర్నియా పీచెస్, గోట్ ఛీజ్, హెర్బ్స్ కలిపిన ట్రఫుల్ పార్మసాన్ పొటాటో ఫ్రైస్, వెజిటేరియన్ ఐటమ్స్‌ని ఆర్డర్ చేసాం. ముందుగా సూప్ తెచ్చింది. తర్వాత ఆమె తెచ్చిన పార్మసాన్ పొటాటో ఫ్రైస్ ప్లేట్ మీది ఎర్రటి పదార్థం చూసి అనుమానం వచ్చి అదేమిటని అడిగితే బీఫ్ అని చెప్పింది. దానిమీద టొమేటో ముక్కలు వేసి తెచ్చింది వెజిటేరియన్ ఆర్డర్ చేసామని చెపితే 'ఓకే' అని దాన్ని తీసుకెళ్ళిపోయింది. బీఫ్ పీస్ తీసేసి మళ్ళీ అదే తెస్తుందేమోనని పద్మజ భయపడింది. దాంతో మిగిలినవన్నీ కేన్సిల్ చేసి సూప్‌కి మాత్రం బిల్ తెమ్మని కోరాను. 30 డాలర్లు సేవాలోపం వల్ల ఆమెకి టిప్ ఇవ్వలేదు. రెగ్యులర్ కస్టమర్స్ రారు కాబట్టి టూరిస్ట్ ప్రదేశాల్లోని వెయిటర్స్ ఇలా నిర్లక్ష్యంగా ఉండటం చాలా చోట్ల చూసాను.

బయటకి వచ్చి ఇందాకటి సూపర్ బజార్‌కి వెళ్ళి వెజ్ సేండ్ విచ్‌ని కొనుక్కుని గదికి వెళ్ళాం.

***31-10-2018 బుధవారం***

ఉదయం 8.30కి నిద్రలేచాం. రెడీ అయి 9.30కి బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్ళాం. అమెరికన్ బ్రేక్‌ఫాస్ట్ కాదు. వెజిటేరియన్స్ తినడానికి ఏపిల్స్, సీరియల్ తప్ప ఇంకేం లేవు. తాగడానికి ఆరెంజ్ జ్యూస్, పాలు, రెండు వెరైటీల హెర్బల్ టీస్ ఉన్నాయి. ఈ రోజు మాకు సబ్ మెరైన్ టూర్ ఉంది. దీన్ని 'కేటలీనా ఎడ్వెంచర్ టూర్స్' నిర్వహిస్తోంది.

ఉదయం పదికి రూం ఖాళీచేసి సామాను రిసెప్షన్‌లో ఇచ్చాం. బయటకి వచ్చి పోర్ట్‌కి చేరుకున్నాం. పోర్ట్‌లో ఫుడ్ కోర్ట్ ఉంది. ఓ దాంట్లో స్మాల్ ఫ్రెంచ్ ఫ్రైస్ (7.25 సెంట్స్) క్రిస్పీ టాకోస్ (9.25 సెంట్స్) తక్కువ పాలు, తక్కువ చక్కెరతో ఇంట్లో చేసిన ఐస్‌క్రీం (3.50 సెంట్స్) కొని తిన్నాం. పోర్ట్ ఆఫీస్‌లో లిపి మా సబ్ మెరైన్ టూర్ టికెట్ ప్రింటౌట్స్‌ని టిక్కెట్లుగా ఎక్స్చేంజ్ చేసి తెచ్చింది. ముగ్గురికీ 132.20 సెంట్స్. బీచ్‌లో చుట్టుపక్కల ఇసక లేదు. కారణం కొండలు తప్ప నేల లేకపోవడం. నేల ఉంటే ఇసక కొట్టుకువచ్చి కనిపించేది.



11.30కి సమీపంలోని యెల్లో సబ్‌మెరీన్ క్యూలో నిలబడ్డాం. లోపలకి బయటి ఫుడ్స్, డ్రింక్స్ అనుమతించరు. మొత్తం 45 నిమిషాల టూర్. 11.45కి రేంప్ ఆరంభంలో నిలబడ్డ నల్లజాతి వృద్ధుడు మా టిక్కెట్స్‌ని చూసి లోపలికి అనుమతించాడు. రేంప్ మీద 'తడిగా ఉంది. కాళ్ళు జారచ్చు. జాగ్రత్త' అనే హెచ్చరిక బోర్డుంది. మెట్లమీంచి కిందకి దాదాపు పదిహేను అడుగులు దిగాం. సబ్ మెరీన్‌లో అటు, ఇటు కిటికీలు. మధ్యలో ఏభై సీట్లున్నాయి. ఆ ట్రిప్‌కి పదకొండుమంది ఉన్నాం. నియమాల ప్రకారం టివి మానిటర్లో లైఫ్ జాకెట్‌ని ఎలా ఉపయోగించాలో చూపించారు. దాంతోపాటు చేపలకి ఆహారం వేయదలచినవారు 6,8,12,16,20 డాలర్లు చెల్లించాలని, ఎంతైనా ఇవ్వమని కోరారు. సబ్‌మెరైన్ బయలుదేరి కిందకి వెళ్ళాక ఇంజన్ శబ్దానికి అవి దగ్గరకి రావని కాసేపు ఇంజన్ ఆఫ్ చేసారు. అద్దాల కిటికీల్లోంచి సముద్రగర్భంలోని కోరల్స్, వందలకొద్దీ వెండి రంగు చేపలు కనిపించాయి.

ఓ చోట ఆరెంజ్ రంగు చేపలని చూపించి సిబ్బందిలోని ఒకరు చెప్పారు.

"ఇది కేలిఫోర్నియా స్టేట్ ఫిష్. ఇవి చాలా తక్కువ ఉన్నాయి. ఆ చేపని పట్టుకున్నా, చంపినా వెయ్యి డాలర్ల ఫైన్. సంవత్సరం జైలు శిక్ష."

సముద్రగర్భంలో పైనించి పడే వెలుగులో, 300 అడుగుల లోతులో అంతా అడవిలా కనిపించింది. నేలమీద గులకరాళ్ళు, భూమి మీదలా పెద్ద చెట్లు, కోరల్ రీఫ్స్ కనిపించాయి. రంగురంగుల చేపల బృందాలు చాలా కనిపించాయి. అవి సబ్‌మెరైన్ కన్నా వేగంగా ఈదుతున్నాయి. కొన్ని సముద్రపు పక్షులు సముద్ర ఉపరితలం లోంచి లోపలికి మునిగి, ఈదుతూ చేపల్ని పట్టుకోవడం కనిపించింది. అటు, ఇటు ఉన్న కిటికీల వైపు తిరుగుతూ అనేక రంగుల, సైజుల జలచరాలని చూసాం. చివరలో సిబ్బందిలో ఒకరు 3-2-1 అని చెప్పగానే పెద్ద చప్పుడు వినిపించింది అది టార్పెడో పేలిస్తే వచ్చే చప్పుడని చెప్పారు. ముప్పావు గంట మాకు నలభై ఐదు క్షణాల్లా అనిపించింది. 12.30కి వెనక్కి వచ్చాం.



పూర్వం మా మెక్సికో, జమైకా ట్రిప్‌లో కూడా ఇలాంటి సబ్‌మెరైన్ టూర్ ఉంది. కానీ మాయన్ సంస్కృతి, దేశం చూడలనే ఉద్దేశంతో ఆ టూర్‌ని తీసుకోలేదు. సబ్‌మెరీన్ ఆగాక పైన హేచ్ డోర్ తెరవగానే మెట్లెక్కి బయటికి వచ్చాం. ఈ టూర్ మా ముగ్గురికీ బాగా నచ్చింది. సముద్రగర్భంలోకి వెళ్ళడం మాకు ఇదే తొలి అనుభవం.

ఇంకా మా తిరుగు ప్రయాణానికి టైం ఉండటంతో లిపి మమ్మల్ని సముద్రపు ఒడ్డునగల రోడ్ మీద దాదాపు కిలోమీటర్ దూరంలో ఎవలాన్ బే చివరలో ఉన్న కేటలీనా కేసినో భవంతి దగ్గరకి తీసుకెళ్ళింది. దీన్ని విలియం రిగ్లీ జూనియర్ నిర్మించాడు. 29 మే 1929లో దీన్ని ఆరంభించారు. దీని ఎత్తు షుమారు వందడుగుల పైనే. మెయిన్ ఫ్లోర్‌లో ఎవలాన్ సినిమా థియేటర్, ఒకేసారి 1,500మంది నృత్యం చేయగల 20వేల చదరపు అడుగుల బాల్ రూం ఉన్నాయి. ఇది ప్రపంచంలో సపోర్టింగ్ పిల్లర్స్ లేని అతి పెద్ద గుండ్రటి బాల్ రూం. పై ఫ్లోర్‌లో ప్రామినేడ్ ఉంది. ఇక్కడ ఎన్నడూ జూదం మాత్రం ఆడలేదు. ఇక్కడ బ్రాడ్వే నాటకాలని ఆడారు. అనేక స్పెషల్ ఈవెంట్స్‌ని కూడా నిర్వహించారు. దాని తలుపులు మూసేసి ఉండటంతో బయటనించే చూసాం. దానికి ఇటువైపు సముద్రం. అటువైపు రోడ్ అవతల కొండ ఉన్నాయి.



అక్కడ నించి లంచ్‌కి మా హోటల్‌కి వెళ్ళే దారిలోని ‘పిజేరియా ఒరిజినల్‘ అనే రెస్టారెంట్‌కి వెళ్ళాం. ఒకతను ఓపెన్ కిచెన్‌లో వండుతున్నాడు గోడలకి హాలివుడ్ పాత తరం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఫోటోలున్నాయి. కొన్నిటిమీద వారి సంతకాలుకూడా ఉన్నాయి. అక్కడున్న బోర్డ్స్ మీది కొటేషన్స్‌లో ఒకటి

‘థింకింగ్ ఎబౌట్ మై స్లిమ్ బాడీ? బట్ ఆల్సో థింక్ ఎబౌట్ ఎం.ఎం.ఎం చాక్లెట్.

లార్జ్ వెజ్ పీజా 20 డాలర్లు. చాలా రుచిగా ఉంది. మా ముగ్గురికి ఒక్కటీ సరిపోయింది. అక్కడ నించి మా హోటల్‌కి వెళ్ళాం. మా హోటల్‌కి అన్నీ పదినిమిషాల నడక దూరంలోనే ఉన్నాయి. 1978నించి ఈ హోటల్ నడుస్తోంది. ఇక్కడ ఫేమిలీ రీ యూనియన్స్, వెడ్డింగ్స్, మిడ్‌వీక్ గెటవేస్, గర్ల్స్ వీకెండ్ మొదలైనవి సెలబ్రేట్ చేసుకుంటారు. 2010లో ఈ హోటల్‌ని మళ్ళీ రెనొవేట్ చేసారన్నా బోర్డ్ బయట కనిపించింది. రిసెప్షన్‌లో పెట్టిన సామాను తీసుకుని పోర్ట్‌కి నడిచి వెళ్ళాం. వెళ్ళిన పదినిమిషాలకి హార్బర్‌లోకి అనుమతించారు. బోర్డింగ్ 3.47కి. ఫెర్రీ 4.30కి బయలుదేరింది. 5.56కి లాంగ్ బీచ్ పోర్ట్‌లోంచి బయటకి వచ్చాం. లిపి బుక్ చేసిన ఊబర్ టేక్సీ ఐదారు నిమిషాలకి వచ్చింది. అక్కడనించి మా ప్రయాణం లాస్‌ఏంజెలెస్‌కి.

కేటలినా ఐలండ్‌కి సగటున రోజుకి నాలుగువేలమంది పర్యాటకులు వస్తారు. అమెరికన్ స్వతంత్ర దినమైన జులై 4న ఇరవై వేలమంది దాకా వస్తారు. అమెరికన్స్, ముఖ్యంగా కేలిఫోర్నియా రాష్ట్రంవారు ఇక్కడికి శెలవలు గడపడానికి వస్తూంటారు. లాంగ్ బీచ్‌నించి ఇక్కడికి పావుగంటలో హెలికాప్టర్లో కూడా రావచ్చు. ఆరెంజ్ కౌంటీ, శాన్‌డియాగోనించి వచ్చేవారికి డేనా పాయింట్‌లో మరో రేవుంది. అక్కడ షాపింగ్, రెస్టారెంట్స్, పిక్నిక్ పార్క్స్, బార్బెక్యూ సౌకర్యం ఉన్నాయి.

పర్యాటకులని హెచ్చరించే ఓ బ్రోషర్‌ని మా హోటల్ గదిలో ఉంచారు. కేటలినా ఐలాండ్‌లో పర్యాటకులు జాగ్రత్త వహించాల్సింది బైసన్(దున్నపోతు) విషయంలో. సగటున 817 కిలోల బరువుండే ఇవి ఈ ద్వీప పర్వతాల్లో 110 ఉన్నాయి. ఒకప్పుడు 2,000 ఉండేవి. ఇవి గంటకి 35 మైళ్ళ వేగంతో పరిగెత్తుతూ మీదకి వస్తాయి. భద్రమైన దూరమంటూ లేకపోయినా కనీసం దానికి 125 అడుగుల దూరంలో ఉండాలని ఓ బ్రోషర్‌లో రాసారు. ప్రశాంతంగా కనిపించినా, భయపడితే ఇవి దాడి చేస్తాయి. ఫోటోలకి కానీ, మరే కారణంగా కాని వాటి జోలికి వెళ్ళకూడదు. వీటి మీద ఓ కన్నేసి ఉంచాలి. అకస్మాత్తుగా ఎవరైనా కనపడితే ఇవి దాడి చేస్తూంటాయి కాబట్టి హైకర్స్ గట్టిగా మాట్లాడటం, చప్పట్లు కొట్టడం చేయద్దని ఆ బ్రోషర్లో సూచించారు. ఒంటరి దున్నపోతులు కుక్కలు, సైకిళ్ళ మీద దాడి చేస్తాయి కాబట్టి పెంపుడు కుక్కల బెల్ట్ పట్టుకుని బైసన్‌కి దూరంగా ఉంచాలి. అది కనిపిస్తే సైకిల్ దిగి నడవాలి. పిల్లలు దగ్గరున్నప్పుడు ఈ దున్నపోతులతో చాలా ప్రమాదకరం. ఇక్కడి సిగ్నేచర్ డ్రింక్ బఫెలో మిల్క్ (గేదపాలు). కేటలినా ఐలండ్‌లో నక్కలు, బాల్డ్ ఈగిల్స్ కూడా ఉన్నాయి.

**ఇక్కడున్న పర్యాటక ఆకర్షణలు.**

ఇక్కడ పర్యాటకులకి చాలా ఏక్టివిటీలున్నాయి. ఐలండ్‌లో ఎక్కడికి వెళ్ళినా ఏదో పర్యాటక ఆకర్షణ కనిపిస్తూనే ఉంటుంది. వాటిలో కొన్ని...

*కేనియన్స్ (లోయల) మీద రెండు గంటల జిప్ లైన్ ఎకో టూర్‌లో కొండ శిఖరం నించి జిప్ లైన్. వందల అడుగుల ఎత్తునించి జారుతూంటే ఈ ద్వీపం మొత్తం కనిపిస్తుంది.

* గ్లాస్ బాటమ్ పడవల్లో సైట్ సీయింగ్ టూర్స్.

* వెహికల్స్‌లో బేక్ కంట్రీ ఎక్స్‌కర్షన్.

* గోల్ఫ్ క్లబ్.

* శాన్ పెడ్రో బీచ్. ఇది ద్వీపంలోని అతి పొడవైన బీచ్. మరోటి డెస్కాన్సో బీచ్.

* మౌంటెన్ బైక్స్, పెడల్ బోట్, కయాక్ బోట్లని అద్దెకి తీసుకోవచ్చు.

* పార్క్‌లు, ప్లే గ్రౌండ్స్, బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టులు, మినీ గోల్ఫ్, నేచర్ సెంటర్‌లు.

* ద్వీపం మధ్యకి వెళ్ళి బైసన్‌లని చూడచ్చు.

* లవర్స్ కోవ్, సాయంత్రం ఘోస్ట్ టూర్, వివిధ క్యూజిన్స్‌ని సర్వ్ చేసే చాలా రెస్టరెంట్లు.

* సైక్లోన్ సీ ఎడ్వెంచర్.

* రిగ్లీ మెమోరియల్ బొటానికల్ గార్డెన్.

* ట్రాన్స్ కేటలినా ట్రయల్ రోడ్ మీద ద్వీపం మొత్తం కాలినడకన లేదా సైకిల్ మీద తిరిగి చూడచ్చు.

* ఎవలాన్ కేనియన్ ఫిట్ ట్రయల్. దారుఢ్యం గలవారు పైకెళ్ళే రోడ్ మీద నడవచ్చు.

* స్కూబా ట్రైనింగ్ స్కూల్స్

* హెలికాప్టర్ టూర్.

* కేంపింగ్‌కి కేంప్ సైట్స్.

* స్థానిక ద్రాక్షపళ్ళ నించి చేసే వైన్ టేస్టింగ్.

* బహెలో బర్గర్ కాన్సర్ట్స్.

* కళాప్రియులకి కేటలినా ఆర్ట్ గేలరీ, రూత్ మేయర్ గేలరీ లాంటి చిత్రాలు అమ్మే గేలరీలున్నాయి.

* 3 గంటల ఫుడ్ అండ్ కల్చరల్ వాకింగ్ టూర్.

* ఇక్కడ పాటరీ, టైల్ మేకింగ్‌లని తక్కువ సమయంలో నేర్పుతారు. పర్యాటకుల తమ పేర్లని రాసిన టైల్స్‌ని తీసుకెళ్తూంటారు.

* క్రూజెస్‌కి ఇద్దరికి గంటకి 150 డాలర్లు. నలుగురికి 175 డాలర్లు. ఆరుగురుంటే 200 డాలర్లు. సన్‌సెట్ క్రూజ్ 299 డాలర్లు. ఐలండ్ చుట్టూ తిప్పడానికి 699 డాలర్లు. సీ రాక్ క్రూజ్ 299 డాలర్లు. చేపలు పట్టడానికి లైసెన్స్‌ని కొనుక్కోవాలి.

* కేటలినా మ్యూజియంలో రాత్రి 8కి ఆరుబయట ఏంఫీ థియేటర్‌లో సినిమా ఉచితంగా చూపిస్తారు. చలికి బ్లాంకెట్ తీసుకెళ్ళాలి. ఆ రోజు డిస్నీ సినిమా 'కోకో, ఏకర్‌మేన్ ఫేమిలీ'లు చూపిస్తున్నారు. మేము వెళ్ళలేదు. ఇక్కడే 20 డాలర్లకి లైవ్ మ్యూజిక్‌కి డేన్స్‌లో పాల్గొనచ్చు.

* ఎవలాన్ సిటీకి పదిమైళ్ళ దూరంలో ద్వీపం మధ్యలో 1602 అడుగుల ఎత్తైన పర్వతం మీద ఎయిర్‌పోర్ట్ ఇన్ ది స్కై ఉంది. ఆ చిన్న ఎయిర్‌పోర్ట్‌కి నడిచి, లేదా సైకిల్ మీద వెళ్ళాలి.

* ఛైమ్స్ టవర్: 1925లో విలియం రిగ్లీ జూనియర్ బహుమతిగా శ్రావ్యమైన ఛైమ్స్ వినిపించే దీన్ని నిర్మించాడు. కాలక్రమేణా అది పాడవడంతో దాన్ని బాగుచేసారు. ఛైమ్స్ టవర్ ఫౌండేషన్ అనే లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థ దీన్ని నిర్వహిస్తోంది.

*ఈస్టెండ్ ఎక్స్‌ట్రీమ్ హమ్మర్ టూర్ (ఓపెన్ ఎయిర్ టూర్) సీ లెవెల్ నించి 1500 అడుగుల ఎత్తుకి వెళ్ళి ద్వీపాన్ని చూడచ్చు.

* 2 గంటల టూర్ కేటలినా ఎడ్వెంచర్ టూర్.

* హెలికాప్టర్ లోంచి కేటలినా ద్వీపాన్ని చూడటానికి రెండు టూర్స్ ఉన్నాయి. మొదటిది పదిహేను నిమిషాలు పడుతుంది. సగం ద్వీపాన్ని మాత్రమే చూడచ్చు. రెండో టూర్‌లో హెలికాప్టర్ నించి పూర్తి ద్వీపాన్ని చూడచ్చు.

*ఎస్కేప్ రూం: ఈ గదిలోకి వెళ్ళాక 60 నిమిషాల్లో తలుపు తాళం కోడ్‌ని కనుక్కుని బయటకి వచ్చిన వారు విజేతలు. లేదా ఓడిపోయినట్లు. ఇందుకు మనిషికి టికెట్ 34 డాలర్లు. ఇద్దర్నే అనుమతించే గదికి 40 డాలర్ల టికెట్. గదిలోకి నలుగురు నించి ఏడుగురు ప్లేయర్స్‌ని కూడా ఎక్కువ ధరకి అనుమతిస్తారు. పదేళ్ళు పైబడ్డవాళ్ళే ఈ ఎడ్వెంచరస్ ఆటలో పాల్గొనచ్చు. (కేటలినారూమ్‌ఎస్కేప్.కాం)

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in